సాక్షి
చిత్తూరు
మంగళవారం । 28 । జనవరి । 2025



మా మొర ఆలకించండి!

సమస్యల పరిష్కారానికి కాళ్లరిగేలా తిరుగుతున్నాం.. మా మొర ఆలకించండి సారూ అని ప్రజలు వేడుకున్నారు. - 8లో



జల్లికట్టు..యువత పట్టు

ఐరాల మండలం వీఎస్ అగ్రహారంలో సోమవారం ఎడ్ల పందేలు కోలాహలంగా సాగాయి. యువత ఉత్సాహం చూపారు. - 8లో



టీడీపీ నేత లేఅవుట్‌లో ప్రభుత్వ బోరు

టీడీపీ నేత వేసిన వెంచర్‌లో ప్రభుత్వ బోరు డ్రిల్లింగ్ చేయించుకున్న ఘటన కుప్పంలో వెలుగుచూసింది. - 8లో

న్యూస్‌రీల్

పోలీసు గ్రీవెన్స్‌కు 47 ఫిర్యాదులు



బాధితులతో మాట్లాడుతున్న ఎస్పీ మణికంఠ

చిత్తూరు అర్బన్: నగరంలోని జిల్లా ఆర్ముడు రిజర్వు (ఏఆర్) కార్యాలయంలో నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కారం కార్యక్రమానికి 47 ఫిర్యాదులు అందాయి. సోమవారం ఎస్పీ మణికంఠ ప్రజల నుంచి వినతులు, ఫిర్యాదులు స్వీకరించారు. ఇందులో కుటుంబ తగాదాలు, వేధింపులు, డబ్బు, భూములు, ఆస్తి తగాదాలకు సంబంధించినవి ఉన్నాయి. వచ్చిన ప్రతీ ఫిర్యాదుపై క్షేత్రస్థాయిలో విచారణ జరిపి, వాటిని పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. వీటిని ఆన్‌లైన్‌లో సైతం నమోదు చేయాలన్నారు. అలాగే చిత్తూరు డీఎస్పీ సాయినాథ్ సైతం ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు.

కాన్పుల సంఖ్య పెంచండి



మందులను పరిశీలిస్తున్న హనుమంతరావు

గుడిపాల: స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో కాన్పుల సంఖ్య పెంచాలని జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి హనుమంతరావు అన్నారు. సోమవారం గుడిపాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆరోగ్య కేంద్రంలో టీకా, మందులు, డ్రగ్‌స్టోర్‌ను పరిశీలించారు. చిన్నపిల్లలకు సరైన సమయంలో టీకా మందులు వేయాలని, వ్యాక్సినేషన్ విషయంలో అ జాగ్రత్త వహించకుండా ఉండాలని క్షేత్రస్థాయి సిబ్బందికి సూచించారు. ఆస్పత్రి ఆవరణాన్ని పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్ సంధ్య, సిబ్బంది అనూష, విజయ, అశోక్, రవి, ఢిల్లీ, వెంకటేష్ పాల్గొన్నారు.

తై అమావాస్య పూజలు రేపు

కాణిపాకం: వరసిద్ధి వినాయకస్వామి ఆలయంలో బుధవారం తై అమావాస్య పూజలు, అభిషేకం నిర్వహించనున్నట్లు ఈఓ పెంచల కిషోర్ తెలిపారు. ఉదయం పూజలు, అభిషేకం..సాయంత్రం గ్రామోత్సవం నిర్వహిస్తామన్నారు. భక్తులు పాల్గొని, స్వామి కృపకు పాత్రులు కావాలని ఆయన కోరారు.

గృహ నిర్మాణ పురోగతికి చర్యలు



మాట్లాడుతున్న కలెక్టర్ సుమిత్ కుమార్

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలో ప్రధాన మంత్రి ఆవాస్ యోజన పథకంలో గృహ నిర్మాణాల పురోగతికి పకడ్బందీ చర్యలు చేపట్టాలని కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో హౌసింగ్ శాఖ, పలు శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ జిల్లాలో వివిధ దశల్లో ఉన్న గృహాలను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. ప్రధాన మంత్రి ఆవాస్ యోజన పథకంలో మంజూరైన 77,366 గృహాల్లో 49,321 పూర్తి చేశారన్నారు. 2025 జనవరి ఒకటి నుంచి మార్చి 31 వరకు 7,311 గృహాల నిర్మాణం పూర్తి లక్ష్యంగా పనిచేయాలన్నారు. ఇప్పటి వరకు 357 గృహాలు పూర్తికాగా 6,954 గృహాలు వివిధ స్థాయిల్లో ఉన్నట్లు తెలిపారు. వాటిని త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో హౌసింగ్ అధికారులు, ఎంపీడీఓలు సమన్వయం చేసుకుని పనిచేయాలన్నారు. విధి నిర్వహణలో అలసత్వం వహిస్తే కఠిన చర్యలుంటాయని హెచ్చరించారు. హౌస్ హోల్డ్ మ్యాపింగ్‌లో నమోదు కాని ఇళ్లను నమోదు చేసే ప్రక్రియను ఫిబ్రవరి 15 లోపు పూర్తి చేయాలన్నారు. రానున్న వేసవిని దృష్టిలో ఉంచుకుని మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీఓలు వారి పరిధిలోని తాగునీటి సరఫరాకు పబ్లిక్ ట్యాప్‌లు పనిచేస్తున్నాయా, లేదా అనే వివరాలు సేకరించాలన్నారు. తాగునీటి బోర్లలో ఎటువంటి సమస్యలున్నా వాటికి వెంటనే మరమ్మతులు చేయించాలని ఆదేశించారు. తాగునీటి ట్యాంకులను శుభ్రం చేసే ప్రక్రియను పంచాయతీ కార్యదర్శులు కచ్చితంగా చేపట్టేలా పర్యవేక్షించాలన్నారు. సీజనల్ వ్యాధులు ఎక్కువగా కలుషిత నీరు తాగడంతోనే వస్తాయని, వీటిని అరికట్టడానికి శుభ్రమైన తాగునీటి సరఫరా చేయడం ముఖ్యమన్నారు. ఈ సమావేశంలో హౌసింగ్ పీడీ గోపాల్‌నాయక్, ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్‌లు, హౌసింగ్ డీఈలు తదితరులు పాల్గొన్నారు.

ప్రగతిపై పగ.. పల్లె దగా

పాలకుల ఆలోచనలు అభివృద్ధి దిశగా సాగితే పల్లెలు ప్రగతి పథంలో పయనిస్తాయి. ప్రజల జీవనప్రమాణాలు పెరుగుతాయి. విద్య, వైద్యం, సామాజికాభివృద్ధి సాకారం అవుతోంది. అయితే ప్రజాప్రతినిధులు హామీలు విస్మరించడం.. సంక్షేమం గాలికి వదలడం.. విధ్వంసాలకు పాల్పడడం.. అభివృద్ధి పనులకు తిలోదకాలు వదలడం.. గతంలో పూర్తి చేసిన పనులు ప్రారభించకపోవడం.. ఇలా ప్రగతిపై పగపడితే పల్లె దగా పడుతోంది. నేడు కూటమి ఆ దిశగా సాగుతుండడంతో అభివృద్ధి కుంటుపడగా జనం ఇబ్బంది పడుతున్నారు. ఇదీ నేడు గంగాధరనెల్లూరు నియోజకవర్గ దుస్థితి.



- నాడు అభివృద్ధి నేడు విధ్వంసం
- గత ప్రభుత్వంలో నిధులు మంజూరైనా నేడు విఘాతం
- జీడీ నెల్లూరులో ఆగిపోయిన అభివృద్ధి

వెదురుకుప్పం: గంగాధరనెల్లూరు నియోజకవర్గంలో అభివృద్ధి ఆగిపోయింది. ఎన్నికల ముందు నియోజకవర్గాన్ని పారిశ్రామిక హబ్‌గా తీర్చిదిద్ది తద్వారా వేల మంది నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పిస్తామన్న పాలకుల మాటలు నీటి మూటలయ్యాయి. ప్రతి గ్రామానికీ సిమెంటు రోడ్లతో పాటు మురుగునీటి కాలువలు నిర్మిస్తామని ఊదరగొట్టిన నేతలు మౌలిక వసతుల కల్పనకు చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు. అధికారంలోకి రాగానే అభివృద్ధి, సంక్షేమ పథకాలను రెట్టింపు చేస్తామని ఊరూరా డప్పుకొట్టిన నేతలకు నేడు ప్రజల ఇబ్బందులు కనిపించడం లేదని వాపోతున్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి ఎనిమిది నెలలు కావస్తున్నా ఇంతవరకూ ఎక్కడా ఏఒక్క పనీ ప్రారంభం కాలేదన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

అసంపూర్తిగా అభివృద్ధి పనులు

కార్వేటినగరం మండలంలో ఆలత్తూరు, సీడీ కండ్రిగ గ్రామాల్లో గ్రామ సచివాలయాలు అసంపూర్తిగా దర్శనమిస్తున్నాయి. శ్రీరంగరాజపురంలో గ్రామ సచివాలయం, రైతు భరోసా కేంద్రాలు అసంపూర్తిగా దర్శనమిస్తున్నాయి. నెలవాయి సచివాలయం, శెట్టివానత్తం విలేజ్‌క్లినిక్, కటికపల్లె విలేజ్ క్లినిక్, సచివాలయాల పనులు ఆగిపోయాయి. చిలమాకులపల్లె, ఆరిమాకులపల్లె ఉన్నత పాఠశాలల్లో నాడు–నేడు కింద జరుగుతున్న పనులకు గ్రహణం పట్టింది. వెంకటాపురంలోని ఆరోగ్య ఉప కేంద్రం పెచ్చులూడుతుండడంతో సిబ్బంది ఆందోళన చెందుతున్నారు.



ఎస్సార్‌పురంలో అసంపూర్తిగా ఉన్న రైతు భరోసా కేంద్రం

ప్రస్తుతం అరాకొరా సిమెంటు రోడ్లు తప్ప వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో మంజూరైన పనులకు అతీగతీ లేదని అంటున్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఇచ్చిన హామీని భారమైనా ప్రజల కోసం అమలు చేసి, నిధులు మంజూరు చేయగా, ప్రస్తుత ప్రభుత్వం వాటిని పూర్తి చేసేందుకు ముందుకు రావడం లేదని చెబుతున్నారు. జీడీ నెల్లూరును మరో కుప్పంలా అన్ని రంగాల్లోనూ ప్రగతిపథంలో నడిపిస్తామని చెప్పిన ఎమ్మెల్యే థామస్ ఆ మాటే మరిచారని ఆరోపిస్తున్నారు. హామీల అమలు సంగతి అటుంచితే గత ప్రభుత్వంలో చేపట్టిన పనులు సైతం ముందుకు సాగడం లేదని ప్రజలు అంటున్నారు. నాడు ప్రగతికి పట్టం కడితే..నేడు విధ్వంసాలకు బీజం వేస్తున్నట్లు ఆరోపిస్తున్నారు.

ఆర్బీకే పునాదులకే పరిమితం

పాలసముద్రం మండలంలోని కృష్ణజిమ్మాపురంలో గ్రామ సచివాలయం, రైతు భరోసా కేంద్రాలు అసంపూర్తిగా ఉన్నాయి. శ్రీకావేరిరాజపురంలో విలేజ్ క్లినిక్ పనులు ఆగిపోయాయి. ఆముదాలలో రైతు భరోసా కేంద్రం పునాది దశ దాటలేదు. బాలకృష్ణాపురం గ్రామంలో విలేజ్ క్లినిక్ అసంపూర్తిగా ఉంది.



తిరోగమనంలో జీడీనెల్లూరు అభివృద్ధి

గంగాధరనెల్లూరు నియోజకవర్గంలో అభివృద్ధి తిరోగమనం వైపు పయనిస్తోంది. ఛిద్రమైన గ్రామీణరోడ్లతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దుస్థితిలోన్న ప్రభుత్వ కార్యాలయాల్లో అధికారులు సతమతమవుతున్నారు. అసంపూర్తిగా ఉన్న కార్యాలయాల భవనాలతో ఇక్కట్లు పడుతున్నారు. నియోజకవర్గంలో ఎక్కడా బస్‌స్టాండ్ లేదు. ఒక శ్రీరంగరాజపురం మండలంలో మాత్రమే బస్‌షెల్టర్ ఉన్నా అది వినియోగం లేదు. గత సర్కారు అర్హత ఉన్న పేదలకు ఇంటి స్థలంతో పాటు ఇళ్ల నిర్మాణాలు చేపట్టగా, ఇప్పటివరకు వాటిని పూర్తి చేయకపోగా ఒక్కరికీ కొత్తగా ఇల్లు మంజూరు చేయలేదని లబ్ధిదారులు అంటున్నారు. 85 గ్రామాల్లో ఆలయాల నిర్మాణానికి గత ప్రభుత్వం ఊతమిస్తే నేటి సర్కారు ఆ దిశగా ఒక్క అడుగూ ముందుకు వేయలేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఇలా ఒక్క పనీ చేయకుండా ప్రశ్నించిన వారిపై ఎదురుదాడులు చేస్తూ పూర్తిగా విఫలమైనట్లు జనం గుసగులాడుతున్నారు. గంగాధరనెల్లూరు నియోజకవర్గంలో గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అభివృద్ధి పనులకు నిధులు మంజూరైనా నేటి కూటమి ప్రభుత్వం అసమర్థతతో అభివృద్ధి పనులు ఆగిపోయాయి.

బాలారిష్టాల్లో డిగ్రీ కళాశాల

వెదురుకుప్పం మండలానికి అప్పటి డిప్యూటీ సీఎం డిగ్రీ కళాశాలను మంజూరు చేయించారు. పూర్తి స్థాయిలో ఫ్యాకల్టీతోపాటు కళాశాల నిర్మాణానికి పచ్చికాపల్లం సమీపంలో 11 ఎకరాల ప్రభుత్వ భూమిని కేటాయించారు. భవన నిర్మాణానికి రూ.18.70 కోట్లు మంజూరయ్యాయి. 2023 నవంబర్‌లో టెండర్లు పిలిచి, 2024 ఫిబ్రవరినాటికి పూర్తి చేశారు. అగ్రిమెంట్ దశలో ఎన్నికల కోడ్ కారణంగా పనులు ఆగిపోయాయి. ఇంతవరకూ వాటి గురించి పట్టించుకోలేదు. అలాగే వెదురుకుప్పం మండలానికి అగ్నిమాపక కేంద్రం మంజూరైంది. భవన నిర్మాణం కోసం పెనుమూరు ప్రధాన రహదారి పక్కన ఎకరా స్థలాన్ని కేటాయించారు. రూ.60 లక్షలు నిధులు మంజూరయ్యాయి. టెండర్‌తో పాటు అగ్రిమెంట్ కూడా పూర్తి అయినా నేటికీ పనులు చేపట్టలేదు. అలాగే మాంబేడు, పచ్చికాపల్లంలో రైతు భరోసా కేంద్రాల భవనాలు అసంపూర్తిగా ఉన్నాయి. మండలంలోని తంగేళి మిట్ట వద్ద 2013లో రూ.3 కోట్లతో చేపట్టిన ఐటీఐ భవన నిర్మాణాలు అసంపూర్తిగా ఉన్నాయి. రూ.5.20 కోట్లకు ప్రతిపాదనలు పంపినా ప్రయోజనం లేదు. పచ్చికాపల్లం–కార్వేటినగరం, పచ్చికాపల్లం నుంచి దేవళంపేట మీదుగా కొత్తపల్లె మిట్ట వరకు రోడ్లు విస్తరణకు నోచుకోలేదు.

కలగా మిగిలిన 50 పడకల ఆస్పత్రి

పెనుమూరు మండలంలో రూ. 2 కోట్లతో మంజూరైన 50 పడకల ఆస్పత్రి పనులు ఆగిపోయాయి. పెనుమూరు బస్టాండ్‌లో షాపింగ్ కాంప్లెక్స్ పూర్తి అయినా ప్రారంభానికి నోచుకోలేదు. గత ప్రభుత్వంలో చేసిన పనులు ప్రారంభోత్సవానికి కూటమి నేతలు ముందుకు రావడంలేదు.

ఇది అసమర్థత ప్రభుత్వం



గత ప్రభుత్వంలో నిధులు మంజూరైనా పనులను చేపట్టలేని అసమర్థ ప్రభుత్వం ఇది. ఎన్నికల ముందు ఏదేదో చెప్పి ప్రజలు మోసం చేశారు. అధికారంలోకి వచ్చి 8 నెలలు కావస్తున్నా చెప్పిన ఒక్క మాటను నిలబెట్టుకోలేని స్థితిలో పాలకులు ఉన్నారు. అధికార దాహం తప్ప ప్రజల అవస్థలు పట్టడం లేదు. అభివృద్ధి, సంక్షేమంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైంది. మోస పూరిత మాటలతోనే కాలయాపన చేస్తున్నారు. ప్రచార ఆర్భాటాలు తప్ప ప్రజలకు ఒక్క మంచి పనీ చేయలేదు.

– ఎం. రామయ్య, వెదురుకుప్పం

కూటమి చుక్కలు చూపుతోంది



వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రజలకిచ్చిన ఏ ఒక్క హామీని వదలలేదు. ఎంతటి భారమైనా అమలు చేసి తీరింది. గత ప్రభుత్వం కంటే మూడింతల అభివృద్ధి, సంక్షేమం అందిస్తామంటూ గద్దెనెక్కిన కూటమి ప్రభుత్వం ప్రజలకు చుక్కలు చూపిస్తోంది. గత ప్రభుత్వంలో నిధులు మంజూరైనా పాలకులు వాటిని పూర్తి చేసేందుకు ముందుకు రావడం లేదు. ఇది ప్రజలకోసం పని చేయడం లేదు. నియోజకవర్గంలో ఎమ్మెల్యే థామస్ చెప్పిన హామీ ఒక్కటీ చేపట్టలేదు.

-కే. భారతి, సర్పంచ్‌ల సంఘం మండల అధ్యక్షురాలు, వెదురుకుప్పం

అపోలో కాలేజీలో కొండచిలువ హల్‌చల్



కాలేజీలోకి వచ్చిన కొండ చిలువ

చిత్తూరు రూరల్ (కాణిపాకం): చిత్తూరు నగరంలోని మురకంబట్టు అపోలో కాలేజీలో ఆదివారం రాత్రి కొండచిలువ హల్‌చల్ చేసింది. రాత్రి 11 గంటల ప్రాంతంలో సుమారు 10 అడుగుల పొడవు ఉన్న చిలువ కాలేజీలోకి వచ్చింది. ఆ పాము విద్యార్థుల కంట పడడంతో వారు కేకలు పెట్టారు. దీంతో కళాశాల నిర్వాహకులు అటవీశాఖ సిబ్బందికి సమాచారం అందించారు. వారు కొండ చిలువను చాకచక్యంగా పట్టుకున్నారు.

4న రథసప్తమి

కాణిపాకం: వరసిద్ధివినాయక స్వామి అనుబంధ ఆలయమైనా మణికంఠేశ్వర స్వామి ఆలయంలో ఫిబవరి 4వ తేదీన రథసప్తమి వేడుకలను నిర్వహిస్తున్నట్లు ఈఓ పెంచల కిషోర్ తెలిపారు. ఈ సందర్భంగా సూర్య నారాయణస్వామివారికి అభిషేక పూజలు జరుగుతాయన్నారు. కల్యాణ వేదిక వద్ద సూర్య నమస్కారం నిర్వహిస్తామని ఆయన పేర్కొన్నారు.

సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో పోలీసుల విచారణ

చిత్తూరు కార్పొరేషన్: నగరంలోని అర్బన్ రిజిస్ట్రార్ కార్యాలయంలో చిత్తూరు తాలూకా పోలీసులు సోమవారం విచారణ నిర్వహించారు. చిత్తూరు అర్బన్ తహసీల్దార్ ఫోర్జరీ సంతకంతో తయారు చేసిన నకిలీ ఎంజాయిమెంట్ ధ్రువీకరణ పత్రంతో జరిగిన రిజిస్ట్రేషన్‌పై ఆరా తీశారు. తహసీల్దార్ సంతకం ఫోర్జరీపై ఆమె కేసు పెట్టడంతో విచారణ ప్రారంభమైంది. దీనిపై ఇప్పటికే ముగ్గురు వీఆర్‌ఎలను విచారించగా ఇందులో ఇద్దరు వీఆర్‌ఎల హస్తం ఉన్నట్లు తెలుస్తోంది. అలాగే ఓ ప్రైవేటు ఫైనాన్స్‌లో పనిచేసే వ్యక్తి పాత్ర ఈ ఘటనలో కీలకంగా ఉన్నట్లు తెలుస్తోంది. కాగా సబ్‌రిజిస్ట్రార్, సిబ్బంది, డ్యాకుమెంటర్‌రైటర్‌ని ఓ గదిలోకి తీసుకుపోయి రహస్యంగా విచారణ చేశారు. నకిలీ ధ్రువీకరణ పత్రంతో రిజిస్ట్రేషన్ ఎలా చేశారు, దస్తావేజును ఎవరు సిద్ధం చేశారు, కార్యాలయ సిబ్బంది హస్తం ఉందా? అనే విషయాలపై కీలక సమాచారం సేకరించారు. రిజిస్ట్రేషన్‌కు ఏ డాక్యుమెంట్లు అవసరం, సమర్పించిన డాక్యుమెంట్లను ఎలా నిర్ధారిస్తారనే వివరాలపై పోలీసులు విచారణ చేశారు. పోలీసులు విచారణ నేపథ్యంలో కార్యాలయంలో అలజడి నెలకొంది.

మద్యం దుకాణాలకు దరఖాస్తుల ఆహ్వానం

- 5న ఆఖరు గడువు.. 7న చిత్తూరులో లాటరీ
- ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ డీసీ విజయశేఖర్



గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేస్తున్న ఎక్సైజ్ డీసీ, అధికారులు

చిత్తూరు అర్బన్: జిల్లాలో కల్లుగీత సామాజిక వర్గాల కోసం ప్రభుత్వం రిజర్వు చేసి న దుకాణాలకు ఆసక్తి ఉన్న వారి నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ డిప్యూటీ కమిషనర్ విజయ శేఖర్ తెలిపారు. సోమవారం చిత్తూరులో ని ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ క ల్లుగీత కార్మికుల కులాలకు సంబంధించిన మద్యం దుకాణాల గెజిట్ నోటిఫికేషన్‌ను విడుదల చేస్తున్నట్లు ప్రకటించారు. ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవడానికి ఫిబ్రవరి 5వ తేదీ, సాయంత్రం 5 గంటల వరకు గడువు ఉంటుందన్నారు. 6వ తేదీన దరఖాస్తులను పరిశీలించి, 7న లాటరీ పద్ధతిలో దుకాణాలను కేటాయిస్తామన్నారు. చిత్తూరు నగరంతో పాటు నగరి, పలమనేరు, పుంగనూరు మునిసిపాలిటీలు, చిత్తూరు రూరల్, గుడుపల్లె, వి.కోట మండలాల్లో మద్యం దుకాణాలు లాటరీ ద్వారా ఈడిగ సామాజికవర్గానికి కేటాయించామన్నారు. పాలసముద్రం గౌడ, పెద్దపంజాణి గౌండ్ల, వెదురుకుప్పంలో గౌడ్ కులాలు ఒక్కో దుకాణం రిజర్వు చేశామని.. ఆయా ఉప కులాలకు చెందిన వాళ్లు మాత్రమే దరఖాస్తు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఇతర జిల్లాల వారు ఇక్కడ, ఈ జిల్లాకు చెందిన వారు ఇతర జిల్లాల్లో దరఖాస్తు చేయడానికి వీల్లేదన్నారు. ఒకే జిల్లాలో ఎన్ని దుకాణాలకైనా దరఖాస్తు చేసుకోవచ్చని, కానీ ఒకే వ్యక్తికి లాటరీలో ఒకటి కంటే ఎక్కువ దుకాణాలు వస్తే, కేవలం ఒక్క దుకాణం మాత్రమే ఎంచుకోవాలన్నారు. ఈనెల 7వ తేదీ ఉదయం 10 గంటలకు దరఖాస్తులను చిత్తూరులోని దొడ్డిపల్లె సమీపంలో ఉన్న చిత్తూరు సహకార చక్కర ఫ్యాక్టరీ కళ్యాణ మండపంలో లాటరీ పద్ధతిలో దుకాణాల కేటాయింపు జరుగుతుందని, ఆ మరుసటి రోజు నుంచే లైసెన్సులు కేటాయించి, మద్యం దుకాణాల నిర్వహణకు అనుమతి ఇస్తామన్నారు. దుకాణం వచ్చిన వారు అన్–రిజర్వు దుకాణాలతో పోలిస్తే 50 శాతం మాత్రం లైసెన్సు ఫీజుగా నిర్ణయించామన్నారు. జిల్లాలోని ఎనిమిది ఎక్సైజ్ పోలీస్ స్టేషన్ల వద్దకు వెళ్లి దరఖాస్తులు అందచేయవచ్చన్నారు. ఎక్సైజ్ ఈఎస్ శ్రీనివాస్, ఏఈఎస్ కృష్ణకిషోర్‌రెడ్డి, అర్బన్ సీఐ శ్రీహరిరెడ్డి పాల్గొన్నారు.

ట్రామా.. డ్రామా!

పీపీపీ విధానం.. వసతులు శూన్యం.. సకాలంలో అందని వైద్యం.. రోగులకు సిఫార్సులే శరణ్యం.. ఫలితం ప్రాణాపాయం.. ఇదీ చిత్తూరు జిల్లా ప్రభుత్వాస్పత్రిలో రోడ్డు ప్రమాద క్షతగాత్రుల దైన్యం. అపోలోతో నాటి టీడీపీ సర్కారు కుదుర్చుకున్న ట్రామా కేర్ సెంటర్ ఎంఓయూ కాలం చెల్లింది. అయినా ట్రామాకేర్ మాత్రం చేకూరలేదు. ఈ విషయమై సర్కారు ఉదాసీనంగా ఉంది. ఫలితంగా నిత్యం రోడ్డు ప్రమాదాల్లో గాయపడుతున్నవారి ప్రాణాలు గాల్లో కలుస్తున్నాయి. మొత్తంగా జిల్లాస్పత్రిలో ట్రామా ఓ డ్రామాగానే మిగిలింది.

క్షతగాత్రులతో కిటకిటలాడుతున్న చిత్తూరు ప్రభుత్వాస్పత్రి (ఫైల్)



చిత్తూరు జిల్లా ప్రభుత్వాస్పత్రి వివరాలు

ఆస్పత్రిలో పడకలు	400
రోజుకు ఇన్‌పేషెంట్లు	350 నుంచి 400 మంది
అవుట్ పేషెంట్లు	2600 మంది
రోడ్డు ప్రమాద క్షతగాత్రులు	85 (నెలకు సగటున)
ఇతర ఆస్పత్రులకు రెఫర్	47 (రోజుకు సగటున)

- కాలం చెల్లిన ఎంఓయూ
- జిల్లా ప్రభుతాస్పత్రిలో కనిపించని ట్రామా కేంద్రం
- రోడ్డు ప్రమాద క్షతగాత్రులకు వైద్యం ఎక్కడ?
- మెరుగైన వైద్యం చేయలేక.. రెఫరల్స్‌తో దాటవేత

చిత్తూరు అర్బన్: నగరంలోని ఒకే ఒక్క ప్రభుత్వాస్పత్రిని 2015లో అపోలో వైద్య సంస్థలకు అప్పగించారు. తొలుత ఐదేళ్ల పాటు లీజుకు ఇస్తున్నట్లు ప్రకటించిన నాటి టీడీపీ ప్రభుత్వం.. ఆపై 33 ఏళ్ల పాటు ప్రభుత్వాత్రిని అపోలోకు లీజుకు ఇస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఆస్పత్రిలో ఎలాంటి సౌకర్యాలు కల్పించాలి? సిబ్బంది ఎంత మంది ఉండాలి? ఎలాంటి వైద్య పరికరాలు? మౌలిక వసతులు, సదుపాయాలు కల్పించాలి? ఏయే విభాగాలను ఆస్పత్రిలో ఏర్పాటు చేయాలి? అనే చాలా అంశాలపై మెమొరాండం ఆఫ్ అండర్ స్టాండింగ్(ఎంఓయూ) పేరిట ఒప్పందం కుదుర్చుకుంది. ఈ ఒప్పందం ప్రకారం చిత్తూరు ప్రభుత్వాస్పత్రిలో ×ట్రామా® కేంద్రాన్ని తప్పనిసరిగా ఏర్పాటు చేయాలి. అపోలో నాటి టీడీపీ ప్రభుత్వంతో కుదుర్చుకున్న ఒప్పందం పూర్తయ్యి పదేళ్లు దాటుతున్నా.. ఇప్పటి వరకు ట్రామా గురించి అటు ప్రభుత్వం, ఇటు అధికారులు పట్టించుకోవడంలేదు.


ఎందుకీ 'ట్రామా'..?

చిత్తూరు నగరం రెండు రాష్ట్రాలకు సరిహద్దు. పైగా పుణ్యక్షేత్రాలను కలిపే ప్రధాన నగరం. తమిళనాడు, కర్ణాటక నుంచి తిరుపతి వచ్చేవారి సంఖ్య ఏటా పెరుగుతోంది. ఈ క్రమంలో జాతీయ రహదారులపై రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయి. రోడ్డు ప్రమాదాలు జరిగినప్పుడు బాధితుల శరీరంలో ఎముకలు విరగడం, రక్తనాళాలు, నాడీ కణాలు తెగిపోవడం జరుగుతుంటాయి. ఫలితంగా అంతర్గత అవయవాల్లో తీవ్ర రక్తస్రావం జరిగి, చివరగా మృత్యువాత పడుతుంటారు. ప్రమాదం జరిగిన వారి శరీరంలో ఇంతి తీవ్రత ఉన్న ఘటన జరిగినప్పుడు.. వాటన్నింటికీ కలిపి ఒకేచోట వైద్యం అందించడాన్నే ట్రామ అంటారు. దీంతో మరణాల రేటును గణనీయంగా తగ్గించవచ్చు. శల్యవైద్యులు (ఆర్థోపెడిక్), గుండె వైద్య నిపుణులు (కార్డియో), మత్తు మందు ఇచ్చే వైద్యులు (అనస్తీషియా), 24 గంటల పాటు వైద్యుల పర్యవేక్షణలో ఐసీయూ, వెంటిలేటర్లు, డయాలసిస్, సర్జన్, ఎండోట్రేకియా ట్యూబ్ లాంటి అత్యాధునిక పరికరాలతో కనీసం 50 పడకలతో ట్రామా కేంద్రం ఏర్పాటు చేయాలి. ప్రభుత్వంతో కుదుర్చుకున్న ఎంఓయూలో ఇది ప్రధాన అంశం.

రెఫరల్స్ శరణ్యం

చిత్తూరులోని జిల్లా ప్రభుత్వాస్పత్రిలో ట్రామా ఏర్పాటు చేయకపోవడంతో రోడ్డు ప్రమాదాల సమయంలో ప్రాణపాయ పరిస్థితుల్లో ఉన్న వారిని ఇక్కడకు తీసుకొచ్చి ప్రాథమిక చికిత్స అందించి చేతులు దులుపుకుంటున్నారు. క్షతగాత్రులను కొద్దిసేపు ఇక్కడే ఉంచడం, ఆపై పరిస్థితి చేయిదాటిపోయిందని.. వేలూరు, తిరుపతి, బెంగళూరులోని ఆస్పత్రికి తీసుకెళ్లమని సూచించడం ఇక్కడి వైద్యులకు పరిపాటి మారిపోయింది. ప్రమాదాల సమయంలో అత్యంత కీలకంగా ఉన్న గోల్డెన్ అవర్ అనేది ప్రభుత్వాస్పత్రిలోనే గడచిపోయి.. చివరకు మృత్యు ఘంటికలు వినిపిస్తున్నాయి. ఆస్పత్రి అభివృద్ధి – సలహాల కమిటీలో ఇప్పటికైనా చిత్తూరులో ట్రామా కేంద్రం ఆవశ్యకతను చర్చించి, ఇక్కడ ఏర్పాటుపై జిల్లా యంత్రాంగం, ప్రజాప్రతినిధులు చొరవ చూపాల్సిన అవసరం ఉంది.

చర్చిస్తాం..



ప్రతీ జిల్లా కేంద్రంలో ట్రామా కేంద్రం ఉండాలని ప్రభుత్వం ఇటీవల సూచించింది. ఇక్కడ ట్రామా కేంద్రం ఏర్పాటుపై కలెక్టర్‌తో చర్చించి నిర్ణయం తీసుకుంటాం. రెఫరల్స్ అనేది బాగా తగ్గించాం.

– డాక్టర్ సి.అరుణ్‌కుమార్, వైద్య పర్యవేక్షకులు, చిత్తూరు ప్రభుత్వాస్పత్రి

క్లుప్తంగా

పీఆర్‌లో ఇద్దరు ఉద్యోగుల బదిలీ

చిత్తూరు కార్పొరేషన్ : పంచాయతీరాజ్ (పీఆర్) ఈఈ కార్యాలయంలో ఏఓ, సీనియర్ సహాయకులను మంగళవారం బదిలీ చేస్తూ జెడ్పీ సీఈఓ రవికుమార్‌నాయుడు ఉత్తర్వులు జారీ చేశారు. డిప్యూటేషన్‌పై జిల్లా బీసీ సంక్షేమశాఖకు పంపించారు. ఇటీవల జరిగిన బదిలీల్లో వీరు చిత్తూరులోని ఈఈ కార్యాలయానికి వచ్చారు. ఏమి జరిగిందో ఏమో కానీ పీఆర్‌లోని ఓ అధికారికి వీరికి పొసగడం లేన్నట్లు సమాచారం. గత కొంత కాలంగా వీరి మధ్య సఖ్యత లేకపోవడంతో వారిని మార్పు చేయాలని ఆ అధికారి కంకణం కట్టుకున్నారు. సీఈఓపై ఒత్తిడి తెచ్చి బదిలీ చేయించినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి.

రోడ్డు ప్రమాదంలో గురుకుల టీచర్‌కు తీవ్ర గాయాలు

గంగాధర నెల్లూరు : రోడ్డు ప్రమాదంలో గురుకుల పాఠశాల టీచర్ తీవ్రంగా గాయపడిన సంఘటన మండల పరిధిలో జరిగింది. సోమవారం రాత్రి జరిగిన ఈ సంఘటనపై స్థానికులు తెలిపిన వివరాల మేరకు. గుడిపాలలో ఎంపీడీఓ కార్యాయలంలో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న సుభాష్ చంద్రబోస్ తన భార్య సుధామయిని గంగాధర నెల్లూరు మండలం సర్విరెడ్డిపల్లె వద్ద గల గురుకుల పాఠశాలలో టీచర్‌గా పనిచేస్తోంది.ఈ క్రమంలో తన బైక్‌లో ఆమెను ఎక్కించుకొని ఇద్దరూ తాళంబేడుకు హైవే రోడ్‌లో సోమవారం రాత్రి వెళుతుండగా కండిగ వద్ద కుక్క అడ్డుగా వచ్చింది. దాన్ని తప్పించబోయి బైక్‌పై ప్రయాణిస్తున్న దంపతులు కిందపడ్డారు. దీంతో టీచర్ సుధామయికి తీవ్ర గాయాలయ్యాయి. కాగా ఆమె భర్త సుభాష్ చంద్రబోస్ స్వల్పంగా గాయపడ్డాడు. ఆమె కొన్ని నెలల పాటు నడవలేని స్థితి ఏర్పడినట్లు వైద్యులు పేర్కొన్నారని తెలిపారు.

చిత్తూరులో చైన్ స్నాచింగ్

చిత్తూరు అర్బన్ : చిత్తూరు నగరంలో చైన్ స్నాచింగ్ జరగడంపై మంగళవారం వన్ టౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. కొంగారెడ్డిపల్లిలోని ఎస్ బీఐ కాలనీకి చెందిన మల్లికార్జున రావు సోమవారం రాత్రి మార్కెట్‌కు వెళ్లి తన భార్యతో కలిసి ఇంటికి నడుస్తూ వెళుతున్నారు. ఈ సమయంలో ముఖానికి మాస్క్ వేసుకున్న గుర్తు తెలియని ఇద్దరు వ్యక్తులు బైక్‌పై వచ్చి మల్లికార్జున రావు భార్య మెడలోని బంగారు గొలుసును లాక్కొని పారిపోయారు. 25 గ్రాముల బరువు ఉన్న బంగారు గొలుసు చోరీకి గురైనట్లు బాధితుడు ఇచ్చిన ఫిర్యాదుతో వన్ టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



నకిలీలలు

చిత్తూరు జిల్లాల్లో ఫోర్జరీ వ్యవహారం రోజు రోజుకు దుమారం రేగుతోంది. తవ్వేకొద్ది అక్రమాలు ఒక్కొక్కటి వెలుగు చూస్తుండడంతో విచారణ అధికారులే విస్తుపోతున్నారు. కార్యాలయ ఇంటి దొంగలు నకిలీ కేటుగాళ్లకు అండ దండలు లేకుండానే ఇంత పెద్ద ఎత్తున నకిలీ పత్రాలు సృష్టించడం..రూ.కోట్లు దండుకోవడం సాధ్యమయ్యే పనికాదు. ప్రైవేటు వ్యక్తులకు తోడుగా కార్యాలయ ఇంటి దొంగల ప్రమేయంపై విచారణ సాగుతున్నట్లు సమాచారం. విచారణ లోతుగా సాగితే కూటమి నేత తమ్ముడి నకిలీలలతో పాటు వెనుక ఉండి నడిపిస్తున్న శక్తులు ఎవరో బయటపడే అవకాశం లేకపోలేదు.

- కదులుతున్న ఫోర్జరీ పంజా
- వెలుగులోకి మరిన్ని అక్రమాలు
- ఒక్క సర్టిఫికెట్‌తో మొదలై రూ.కోట్లలో భూపత్రాల సృష్టి

సాక్షి టాస్క్‌ఫోర్స్: చిత్తూరు అర్బన్ తహసీల్దార్ కార్యాలయంలో ఫోర్జరీ పంజా విసురుతోంది. తవ్వేకొద్ది అక్రమాలు బయటపడుతున్నాయి. ఎంజాయిమెంట్ సర్టిఫికెట్‌ను పక్కన పెడితే ఇరువారం, ప్రశాంత్‌నగర్, తదితర ప్రాంతాల్లో అధికారుల ఫోర్జరీ సంతకాలతో పదుల సంఖ్యలో పత్రాలు పుట్టుకొచ్చినట్లు సమాచారం. డీకేటీ భూములు, పట్టాలను ఎరవేసి కాసులు దండుకోవడానికి ప్రైవేటు వీఆర్‌ఏలు ఈ ధందా నడిపించారనే విమర్శలున్నాయి. వీరి చేతికే భూ సంబంధిత ప్రభుత్వ లాగిన్‌లు ఇవ్వడంతో 2018–19 మధ్య కాలంలో పలు సర్వే నంబర్లను ప్రైవేటు వీఆర్‌ఏల బంధువుల పేర్లకు మార్చుకున్నారని కార్యాలయ సిబ్బంది బహిరంగంగా చెబుతున్నారు. ఎలాంటి రికార్డులు లేకుండా అలా ఆన్‌లైన్‌లోకి సర్వే నంబర్లను చేర్చడంపై కార్యాలయంలో విమర్శలు వెలువెత్తుతున్నాయి. వీరు అప్పట్లో అధికారులను చేతిలో పెట్టుకొని ఇష్టారాజ్యంగా వ్యవహరించినట్లు తెలుస్తోంది. ఇక పెరుమాళ్లకండ్రిగ, వరదరాజులపల్లిలో విలువైన భూములను రూ.లక్షల్లో నగదు తీసుకుని ఓ వ్యక్తికి అంటకట్టినట్లు సమాచారం. ఇందులో కూడా ఆ ప్రైవేటు వ్యక్తే కీలకంగా వ్యవహరించారని సిబ్బంది పూస గుచ్చినట్లు చెబుతున్నారు. భూ దానం తర్వాత ఆ ప్రైవేటు వ్యక్తికి కారు బహుమానంగా ఇచ్చారని వినికిడి. ఇలా పదుల సంఖ్యలో ఫోర్జరీ సంతకాలు, మధ్యవర్తిగా వ్యవహరించి అక్రమాలకు పాల్పడినట్లు జోరుగా చర్చ నడుస్తోంది.

ఫోర్జరీ విచారణలో కొన్ని అంశాలు ..

అర్బన్ తహసీల్దార్‌గా పనిచేసిన కలావతి సంతకం ఫోర్జరీ చేశారనే విషయం తెలిసిందే. దీనిపై గుర్తుతెలియని వ్యక్తులుగా కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు వేగవంతం చేశారు. ఈ దొంగల ముఠాను పట్టుకోవడానికి గోప్యంగా విచారణ చేపట్టారు. తహసీల్దార్ ఫిర్యాదుతో తొలుత ముగ్గురు వీఆర్‌ఏలను విచారించారు. ఈ విచారణలో ఓ వీఆర్‌ఏ పాత్ర ఏం లేదని తెలిసింది. కీలకంగా వ్యవహరించిన మరో వీఆర్‌ఏను విచారిస్తే..తాను పత్రం మాత్రమే తీసుకొచ్చానని.. తహసీల్దార్, ఇతరత్రా సంతకాలు చేసిందంతా చిత్తూరు రూరల్ మండలానికి చెందిన ఓ ప్రైవేటు వీఆర్‌ఏనని పోలీసుల సమక్షంలో ఒప్పుకున్నట్లు తెలుస్తోంది.

దొంగ చేతికే తాళాలు

సర్వే నంబర్లను తారుమారు చేయడం, హద్దులను మార్చడం, ఆన్‌లైన్‌లో సర్వే నంబర్లు తొలగించడం వంటి పనులు చేస్తూ గ్రామాల్లో భూ సమస్యలను తెచ్చిపెట్టడానికి ప్రధాన కారకుడు ఆ ప్రైవేటు వ్యక్తియేనని పలువురు మండిపడుతున్నారు. ఈ వ్యక్తి చేతికి మళ్లీ అధికారం ఇస్తే...గ్రామంలో ఉన్న సమస్యలు చాలవంటూ భూ సంబంధిత సమస్యలు మరింత పెరుగుతాయని అంటున్నారు.

సీలు, సంతకాలు ఎవరివి..?

ఫైనాన్స్ సిబ్బంది తప్పుడు పత్రాలు సృష్టించి రుణాలు ఇప్పించడమే పనిగా పెట్టుకుని..ఈ ముఠాతో చేతులు కలిపి రూ.లక్షల్లో సంపాదించినట్లు సమాచారం. ఇలా ఎందుకు చేస్తున్నారు..? ఎలా చేస్తారు..? ఈ ముఠాలో ఎవరెవరు ఉన్నారు? ఎవరెవ్వరితో సంబంధాలున్నాయి ? ఇంకా ఎంత మంది ఉన్నారు? అధికారుల సంతకాలు ఏ రకంగా ప్రాక్టీస్ చేశారు..? సీలు ఇవన్నీ వీళ్లకు ఎక్కడివి..? రిజిస్ట్రార్ ఆఫీసుతో ఎలా సంబంధాలు ఉన్నాయి..? తప్పుడు పత్రాలతో ఏ రకంగా రిజిస్ట్రేషన్ చేయిస్తారు..? ఏ రకంగా లోన్లు తీసుకుంటున్నారనే అనే కోణంలోనే విచారణ లోతుగా జరుగుతున్నట్లు తెలుస్తోంది. అయితే ఈ కేసులో తహసీల్దార్ సంతకం చేసిన ఓ వీఆర్‌ఏ (ప్రైవేటు వ్యక్తి) కూటమి నేత సోదరుడిగా కార్యాలయ సిబ్బంది చెబుతున్నారు. సోదరుడిని తప్పించడానికి ఆ కూటమి నేత అన్ని తానై వ్యవహరిస్తున్నట్లు సమాచారం. పోలీసులు, రెవెన్యూ అధికారులతో మాట్లాడి సర్దుబాటు చేశానని, ఎవరు ఏం చేయలేరని ఆ కూటమి నేత బహిరంగంగా చెప్పుకోవడంపై విమర్శలు చెలరేగుతున్నాయి.

తహసీల్దార్‌ను విచారణ చేసిన పోలీసులు

తహసీల్దార్ కళావతి సంతకం ఫోర్జరీపై తాలూకా పోలీసుల విచారణ కొనసాగుతోంది. మంగళవారం సంతకం ఫోర్జరీ విషయమై తహసీల్దార్ కళావతిని చిత్తూరు అర్బన్ తహసీల్దార్ కార్యాలయంలో పోలీసులు విచారణ చేశారు. సంతకం ఫోర్జరీ అయిందని ఎలా తెలిసింది? ఎవరి ద్వారా సమాచారం వచ్చిందనే ప్రశ్నలు అడిగి తెలుసుకున్నారు. అనుమానిత వ్యక్తులపై ఆరా తీశారు. ఇప్పటి వరకు ఐదుగురిని విచారణ చేసినట్లు పోలీసులు తెలిపారు. త్వరలో ఈ కేసు సంబంధించి పలువురిని అరెస్టు చూపించినట్లు తెలుస్తోంది.

కూటమి నేతల అక్రమాలు ఆపండి

అధికారులకు ఫిర్యాదు చేసిన బీసీ ఫ్రంట్ నేత

పలమనేరు : పలమనేరు మున్సిపాలిటీ పరిధిలోని ఇందిరమ్మ కాలనీలో కూటమి నేతలు ప్రభుత్వ ఖాళీ స్థలాలను ఇష్టానుసారంగా అమ్ముకుంటున్నారని బీసీ ఫ్రంట్ నాయకులు పూలే గోవిందుస్వామి స్థానిక తహసీల్దార్ ఇన్బునాథన్‌కు మంగళవారం ఫిర్యాదు చేశారు. కాలనీలోని ఆఖరి వీధిలో కొంత మేర పభుత్వ ఖాళీ స్థలాలున్నాయని వీటిపై కన్నేసిన నాయకులు రియల్ ఎస్టేట్‌లా అమ్మకాలు చేసుకుంటున్నా అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపించారు. గతంలో కొందరు లబ్ధిదారులు పొందిన స్థలాల్లో పునాదులు వేసి ఆపై బిల్లులందకనో లేక ఆర్థిక ఇబ్బందులతో వాటిని ఇంకా నిర్మించలేదన్నారు. ఇలాంటి వాటిపై కన్నేసిన కూటమి నేతలు జేసీబీలతో వాటిని చదును చేసి కావాల్సిన వారికి సెంట్ల లెక్కన అమ్ముతున్నారని ఆరోపించారు. సాక్ష్యాలతో సహా పత్రాలు సమర్పించినందున వారిపై అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ అక్రమాలకు అడ్డుకట్ట వేయకుంటే జిల్లా అధికారుల ముందు పోరాటానికి సిద్ధంగా ఉన్నానని ఆయన హెచ్చరించారు.



తహసీల్దార్ ఇన్బునాథన్‌కు వినతిపత్రాన్ని అందిస్తున్న గోవిందుస్వామి

కబడ్డీలో మెరిసిన జిల్లా జట్టు



తృతీయ స్థానం సాధించిన బాలికల జట్టు

- పురుషుల విభాగంలో ద్వితీయ, బాలికలకు తృతీయ స్థానం

పుంగనూరు : అంతర్ జిల్లా కబడ్డీ పోటీల్లో చిత్తూరు జిల్లా పురుషుల విభాగానికి ద్వితీయ స్థానం, బాలికల విభాగంలో తృతీయ స్థానాలు కైవసం చేసుకున్నట్లు కబడ్డీ సంఘం జిల్లా కార్యదర్శి గంగాధర్ తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ అంతర్ జిల్లా పోటీలు చోడవరం అంకుపాలెంలో సోమవారం రాత్రి ముగిశాయన్నారు. ఈ పోటీల్లో జిల్లా జట్లు ద్వితీయ , తృతీయ స్థానాలు కైవసం చేసుకున్నా యని తెలిపారు. ఈ సందర్భంగా క్రీడాకారులను అభినందించారు.

సూపర్‌సిక్స్ హామీల మోసకారి

- చంద్రబాబు నైజం ప్రజలను వంచించడమే
- ధ్వజమెత్తిన మాజీ డిప్యూటీ సీఎం నారాయణస్వామి



మాజీ డిప్యూటీ సీఎం నారాయణస్వామి

కార్వేటినగరం : ఎన్నికలు సమయానికి చంద్రబాబుకు హామీలు గుర్తుకొస్తాయని, ఎన్నికలు అయిపోయిన తరువాత హామీలు గుర్తుకురావని మాజీ డిప్యూటీ సీఎం నారాయణస్వామి ధ్వజమెత్తారు. మంగళవారం 'సాక్షి'తో ఆయన ఫోన్‌లో మాట్లాడారు. చంద్రబాబుకు ప్రజలను మోసం చేయడం వెన్నతో పెట్టిన విద్య అన్నారు. సీఎం చంద్రబాబు ఇటీవల విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. సూపర్‌సిక్స్ హామీలను నేరవేర్చలేనని మాట్లాడడం చూస్తుంటే, చంద్రబాబుకు రాజకీయ విలువలు, విశ్వసనీయత లేవని స్పష్టంగా తెలుస్తున్నాయని ఆరోపించారు. హామీలను నెరవేర్చలేనప్పుడు దొంగ హామీలను ఇచ్చి ప్రజలను మోసం చేసి గద్దెనెక్కడానికి సిగ్గు అనిపించలేదా అని ప్రశ్నించారు. ఎల్లో మీడియా ఉన్నంత వరకు చంద్రబాబును ఎవరు ఏమి చేయలేరని, ఎందుకంటే అసత్యాలను నిజాలుగా ప్రచారం చేయడంలో చంద్రబాబుకు వంత పాడే ఎల్లో మీడియా దిట్ట అని ఎద్దేవా చేశారు. మాజీ ముఖ్యమంత్రి ఎన్టీఆర్‌ను వెన్నుపోటు పొడిచిన ఘనుడు చంద్రబాబు అని, ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసి ఎన్టీఆర్ హామీలను తుంగలో తొక్కిన మాయావి అన్నారు. దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి రైతు రుణమాఫీ, ఉచిత విద్యుత్, ఆరోగ్యశ్రీ, 108, 104, విద్యార్థులకు స్కాలర్‌షిప్, జలయజ్ఞం వంటి విప్లవాత్మకమైన పథకాలు ప్రవేశపెట్టి ప్రజల గుండెల్లో దేవుడిగా నిలిచిపోయారని కొనియాడారు. అదే చంద్రబాబు పేరు చెబితే దోపిడీ, దౌర్జన్యం, మోసం, వెన్నుపోటు, అవినీతి వంటివి గుర్తుకొస్తాయని విమర్శించారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి రెడ్డి నవరత్నాలు వంటి పథకాలు ప్రవేశపెట్టి ప్రజల జీవితాల్లో వెలుగు నింపారన్నారు. నేడు సీఎం చంద్రబాబునాయుడు ఎన్నికల సమయంలో సూపర్ సిక్స్ అని మోసపు హామీలు ఇచ్చి, నేడు సూపర్ సిక్స్ పథకం పేరు వింటుంటే భయం వేస్తోందని, వాటిని అమలు చేయడం సాధ్యం కాదని అని అనడంతో చంద్రబాబు నైజం మరొకసారి నిరూపితమైందని ఆయన విమర్శించారు. ఇకనైన రాష్ట్ర ప్రజలు చంద్రబాబు చేస్తున్న మోసాన్ని గుర్తించి రానున్న ఎన్నికల్లో జగనన్నను ఆదరించాలని నారాయణ స్వామి పిలుపునిచ్చారు.

వీఓఏలపై వేధింపులు మానుకోవాలి

– కలెక్టరేట్ ఎదుట వీఓఏలు రెండో రోజు దీక్ష

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలోని వెలుగు వీఓఏ (యానిమేటర్స్) పై అధికార పార్టీ రాజకీయ వేధింపులు మానుకోవాలని ఏపీ వెలుగు (యానిమేటర్స్) అసోషియేషన్ గౌరవాధ్యక్షుడు వాడ గంగరాజు హెచ్చరించారు. ఈ మేరకు డిమాండ్ల పరిష్కారం కోసం ఆ సంఘం నేతలు మంగళవారం (రెండవ రోజు) సామూహిక దీక్ష చేపట్టారు. వీఓఏలకు ప్రతినెలా జీతం ఇవ్వాల్సిన కనీస బాధ్యతను ప్రభుత్వం మరిచిపోవడం దుర్మార్గమన్నారు. ఆరు నెలలుగా జీతం ఇవ్వకుండా పనిచేయించుకోవడం వెట్టిచాకిరి అవుతుందన్నారు. పోరాటానికి పిలుపునిచ్చిన సందర్భంగా రెండు నెలలు వేతనాలు వేస్తున్నామని రాష్ట్ర ప్రభుత్వం చెప్పడం జరిగిందన్నారు. పోరాడితే కానీ జీతాలు ఇవ్వరా అని ప్రశ్నించారు. వీఓఏలకు ఉద్యోగ భద్రత కల్పిస్తామని, 3 సంవత్సరాల కాల పరిమితి సర్క్యులర్ రద్దు చేస్తామని ఇచ్చిన హామీలను తక్షణం అమలు చేయాలని కోరారు. డిసెంబర్ 16వ తేదీన సెర్ప్ సీఈఓ సమక్షంలో జరిగిన చర్చలు, నిర్ణయాలు ఇంత వరకు అమలు కాకపోవడం శోచనీయమన్నారు. అక్రమంగా తొలగించిన వీఓఏలను విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. హైకోర్టు ఇచ్చిన తీర్పును అమలు చేయకపోవడం కోర్టు ధిక్కారమన్నారు. మహిళా మార్ట్‌లలో బలవంతపు కొనుగోళ్ల వల్ల ప్రజలు, గ్రూపు సభ్యుల నుంచి తీవ్ర వ్యతిరేక వస్తోందన్నారు. ఈ దీక్షలో యూనియన్ జిల్లా అధ్యక్షుడు జీను రాజశేఖర్, ప్రధాన కార్యదర్శి శ్రీధర్ బాబు, నాయకులు, వివోఏలు పాల్గొన్నారు.

బొలెరో, ద్విచక్ర వాహనం ఢీ

- చికిత్స పొందుతూ ఒకరి మృతి
- మరొకరికి తీవ్ర గాయాలు



మృతి చెందిన మణెప్ప



చికిత్స పొందుతున్న ఎల్లప్ప

పెద్దపంజాణి : మండలంలోని రాయలపేట–పెనుగొలకల మార్గంలోని జిట్టంవారిపల్లి బస్‌స్టాప్ సమీపంలో బొలెరో , ద్విచక్ర వాహనాన్ని ఢీ కొట్టడంతో ఇద్దరు తీవ్రంగా గాయపడిన సంఘటన మంగళవారం చోటుచేసుకుంది. స్థానికుల కథనం మేరకు వివరాలు.. పెనుగొలకల గ్రామానికి చెందిన కాకెన్న కుమారుడు ఎల్లప్ప, వెంకటస్వామి కుమారుడు మణెప్ప సొంత పనుల నిమిత్తం రాయలపేట గ్రామానికి వచ్చి పనులు పూర్తి చేసుకుని తిరిగి స్వగ్రామమైన పెనుగొలకలకు వెలుతున్నారు. ఈ క్రమంలో పెద్దఉప్పరపల్లి నుంచి తమిళనాడుకు మామిడి కాయల లోడ్‌తో వెలుతున్న బొలెరో వాహనం వీరు ప్రయాణిస్తున్న ద్విచక్ర వాహనాన్ని జిట్టంవారిపల్లి సమీపంలో ఢీ కొట్టింది. దీంతో తీవ్రంగా గాయపడిన వీరిని స్థానికులు, కుటుంబికులు 108 వాహనంలో చికిత్స నిమిత్తం పలమనేరు ఏరియా ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మణెప్ప మృతి చెందాడు. పెద్దపంజాణి పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు.

సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ ఇంట్లో చోరీ

– బంగారు, వెండి, నగదు అపహరణ



చోరీ జరిగిన గోపాలమ్మ నివాసం

గంగాధర నెల్లూరు : గంగాధర నెల్లూరు మండల కేంద్రంలోని దిగువూరు గ్రామంలో మంగళవారం చోరీ జరిగింది. స్థానికుల వివరాల మేరకు దిగువూరులో నివాసం ఉండే గోపాలమ్మ కుమారుడు భానుప్రకాష్‌రెడ్డి బెంగళూరులో సాఫ్ట్‌వేర్ ఇంజినీరుగా చేస్తున్నాడు. స్వగ్రామమైన జీడీ నెల్లూరుకు అప్పుడప్పుడు వచ్చి వెళుతుండేవారు. మంగళవారం ఉదయం ఎదురింటికి చెందినవారు గోపాలమ్మ ఇంటికి తాళం లేకపోవడం గమనించడంతో బెంగళూరులో ఉంటున్న కుటుంబ సభ్యులకు సమాచారం అందించగా స్థానిక పోలీసులకు గోపాలమ్మ బంధువులు ఫిర్యాదు చేశారని తెలిపారు. సమాచారం అందుకున్న స్థానిక సీఐ శ్రీనివాసంతి సంఘటన స్థలానికి చేరుకొని పరిశీలించారు. బాధితుల బంధువుల, గోపాలమ్మ, భానుప్రకాష్‌తో చరవాణిలో మాట్లాడిన సమాచారం మేరకు బంగారు, వెండి నగదు చోరీ జరిగినట్లు ప్రాథమిక సమాచారం అందించారని తెలిపారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

అంత్యక్రియలకు రూ.15 వేలు

చిత్తూరు కలెక్టరేట్ : సర్వీసులో ఉంటూ మృతి చెందిన అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్‌ల అంత్యక్రియలకు రూ.15 వేలు మంజూరు చేయనున్నారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం జారీచేసిన ఉత్తర్వులు జిల్లా ఐసీడీఎస్ కార్యాలయం కు చేరాయి. ఆ ఉత్తర్వుల మేరకు మరణించిన అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్లకు చెందిన చట్టబద్ధమైన వారసులకు రూ.15 వేలు అందజేయాలని పేర్కొన్నారు.

శ్రీవారి దర్శనానికి 8 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో 4 కంపార్ట్‌మెంట్లు ఖాళీగా ఉన్నా యి. సోమవారం అర్ధరాత్రి వరకు 65,278 మంది స్వామివారిని దర్శించుకున్నారు. శ్రీవారికి కానుకల రూపంలో హుండీ ద్వారా రూ. 3.70 కోట్ల ఆదాయం వచ్చింది. టైంస్లాట్ టికెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. టికెట్లు లేని భక్తులకు 8 గంటల్లో దర్శనం లభిస్తోంది.

విద్యార్థి బలవన్మరణం



మహేష్ బాబు (ఫైల్)

పాలసముద్రం : కడుపు నొప్పి తాళలేక పదో తరగతి విద్యార్థి మంగళవారం ఆత్మహత్యకు పాల్పడ్డాడు. వివరాలు ఇలా.. మండలంలోని గంగమాంబపురం పంచాయతీ బలిజూరు గ్రామానికి చెందిన నరసింహులు కూమారుడు మహేష్ బాబు(14) తిరుమలరాజుపురం హైస్కూల్‌లో 10వ తరగతి చదువుతున్నాడు. మహేష్ చాలా రోజులుగా పాఠశాలకు సరిగా వెళ్లడం లేదు. దీంతో తండ్రి పాఠశాలకు వెళ్లి పదో తరగతైనా పాస్ కావాలని మందలించాడు. దీంతో రెండు రోజుల నుంచి విద్యార్థి భోజనం చేయకుండా.. ఎవరితో మాట్లాడకుండా ఉండిపోయాడు. ఈ క్రమంలో అతనికి కడుపు నొప్పి ఎక్కువ అయ్యింది. ఆ బాధ భరించలేక ఇంట్లో ఫ్యాన్‌కు ఉరేసుకున్నాడు. బంధువులు గుర్తించి వెంటనే ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లారు. అయితే బాలుడు అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. తండ్రి నరసింహులు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. పోస్టుమార్టం పూర్తి చేసి మృతదేహన్ని బంధువులకు అప్పగించారు.